బీసీ బంధు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మాట్లాడుతున్న జిల్లా పీఈడీ రాజలింగు

ఇచ్చోడ, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లాలో బీసీ బంధు సర్వేను కార్యదర్శులు పకడ్బందీగా నిర్వహించాలని బీసీ కార్పొరేషన్ జిల్లా పీఈడీ రాజలింగు సూచించారు. శుక్రవారం ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో బీసీ కార్పొరేషన్ సర్వేను పరిశీలించారు. 2023-24 సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ కింద జిల్లాలో మంజూరైన 1099 మంది లబ్ధిదారులకు కుల వృత్తుల అభివృద్ధి కోసం రూ.లక్ష చొప్పున అందించడం జరిగిందన్నారు. వారి నిర్వహిస్తున్న దుకాణం, బిల్లు వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ, సిరికొండ ఎంపీడీవోలు లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

బోథ్, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు తహసీల్దార్ సుభాష్ చందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫైర్ స్టేషన్ లేని కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఉన్న ప్రజలు, రైతులు లక్షల ఆస్తికి నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే బోథ్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున మండలంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇక్కడ పార్టీ జిల్లా నాయకుడు వెంకటేశ్, మండల శాఖ అధ్యక్షుడు కొండమడుగు గణేశ్, మండల నాయకులు బిక్క రమేశ్, సుధాకర్, జల్‌దేవ్, కృష్ణపెల్లి స్వామి ఉన్నారు.

ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్, జనవరి 17 : గ్రామ పంచాయతీల్లో ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఇస్రూ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన మైనార్టీలకు హౌజ్‌ట్యాక్ ఇస్తున్న మరపగూడ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నార్నూర్, జనవరి 17 : వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని హెచ్ఏ రాథోడ్ రవీందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుభద్రబాయి పాల్గొన్నారు.

20న చలో ఉట్నూర్

తాంసి, జనవరి 17: ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఉట్నూర్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు ఆత్రం భరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబుగామ గ్రామం లో తుడుందెబ్బ అధ్యక్షుడు ఆత్రం భరత్ ఆధ్వర్యంలో చలో ఉట్నూర్ మహాధర్నా పోస్టర్‌ను ఆదివాసీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

సాధనతోనే క్రీడల్లో విజయం సాధ్యం

కుభీర్, జనవరి 17: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని సిర్పెల్లి (హెచ్) గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా బెల్గాంతండా, ద్వితీయ స్థానంలో పల్సి టీం నిలిచింది. మొత్తం 14 టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. శుక్రవారం పల్సి గ్రామ మాజీ సర్పంచ్ కొట్టె హన్మాండ్లు, సిర్పెల్లి (హెచ్) నాయకులు పబ్బు ధర్మపురి విజేతలైన టీం సభ్యులకు నగదు, జ్ఞాపికలు అందజేశారు.

నాన్‌ట్రైబల్‌కు బ్యాంకు రుణాలు వచ్చేలా చేయాలి

ఉట్నూర్, జనవరి 17: ఏజెన్సీలో జీవిస్తున్న నాన్ ట్రైబల్ రైతులకు బ్యాంకు రుణాలు వచ్చేలా చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూ పటేల్ అన్నారు. శుక్రవారం నిర్మల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నారు. కార్యకరమంలో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఐటీడీఏ పీవో, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

మూర్తి గురుస్వామి మృతి పై సంతాపం

ఎదులాపురం, జనవరి 17 : బెల్లూరి అయ్యప్ప స్వామి ప్రధాన అర్చకుడు మూర్తి గురుస్వామి శుక్రవారం తనువు చాలించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి జోగు రామన్న సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మూర్తి గురుస్వామితో తనకున్న స్నేహపూర్వక సంబంధం మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

అర్హులను గుర్తించాలి

దస్తురాబాద్, జనవరి 17 : అర్హులైన వారిని గుర్తించాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని ఆకొండపే గ్రామంలో రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మున్యాల గ్రామంలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, ఆర్ఐ గంగన్న, సర్వేయర్ సంధ్యారాణి, ఏఈవో తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

బోథ్, జనవరి 17: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కన్గుట్ట గ్రామంలో శుక్రవారం టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అనుమానితుల తెమ్మడను పరీక్షల నిమిత్తం సేకరించారు. సానాల పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీబీ నిర్ధారణ సూపర్‌వైజర్ సుధ, హెచ్ఈ యశోద, మలేరియా విభాగం ఇచ్చోడ సబ్ యూనిట్ అధికారి రవీందర్, సూపర్‌వైజర్ దేవీదాస్, హెచ్‌వీ సంధ్య, ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య, ఏఎన్ఎం లలిత, పావని, హెచ్ఏ గోవర్ధన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

ఉట్నూర్ రూరల్, జనవరి 17: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ భూమిపూజ చేశారు. అదేవిధంగా మండలంలోని జెండాగూడ, మోర్రిపేట్, శివగూడ గ్రామాల్లోని పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమలంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు దూట రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న యువకులు

బోథ్, జనవరి 17: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కన్గుట్ట గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యువకులు ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్డు, శ్మశాన వాటిక వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇక్కడ మాజీ ఉప సర్పంచ్‌లు మునిగేల రమేశ్, నవ్వ రవీందర్, బుచ్చన్న, నవ్వ రాజు, లక్ష్మణ్ ఉన్నారు.

పెద్దచెరువు చెత్తమయం

పెద్దచెరువులో వేసిన చెత్తాచెదారం

భైంసాటౌన్, జనవరి 17 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని అనుకొని ఉన్న పెద్దచెరువు చెత్తాచెదారంతో నిండిపోయి డంప్‌యార్డును తలపిస్తోంది. పంచాయతీ సిబ్బంది గ్రామంలో ఇంటింటా సేకరించిన చెత్త, ఇతర వ్యర్థాలను చెరువులోనే పడేస్తున్నారు. అంతేకాకుండా చెరువులోనే చెత్తకు నిప్పు పెట్టడంతో దుర్వాసనతో కూడిన పొగ వెలువడుతున్నది. వర్షాకాలంలో వ్యర్థాలన్నీ చెరువంతా వ్యాపించే అవకాశం ఉన్నందున చేపలు చనిపోతాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చెరువు సమీపంలో, చెరువులో చెత్త వేయరాదని అవగాహన కల్పించాల్సిన పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులను నిత్యం పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి చెరువులో చెత్తాచెదారం వేయకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి పశువుల కాపరి మృతి

బోథ్, జనవరి 17 : చెరువులో స్నానానికి వెళ్లి ఈతరాక పశువుల కాపరి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కాంటేగాం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్ సమీపంలోని డోంగర్గావ్ గ్రామానికి చెందిన బర్దావల్ బారుకు భార్య బర్దావల్ నరుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబీకులతో కలిసి ఆయన పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నారు. బారు చిన్న కుమారుడు బర్దావల్ రామేశ్వర్(19) శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో సాబ్లే అమర్ సింగ్, పండరి అంకుశ్‌తో కలిసి కంటేగాం చెరువుకు స్నానం చేయడానికి వెళ్లారు. కాగా రామేశ్వర్ చెరువులోని లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో ఈతరాక నీటిలో మునిగిపోయాడు. అమర్ సింగ్, అంకుశ్‌కు సైతం ఈత రాకపోవడంతో వారు అతడిని కాపాడలేకపోయారు. బోథ్ నుంచి గజ ఈతగాళ్లను తీసుకువచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో రెండు సంవత్సరాలు జైలు

ఎదులాపురం, జనవరి 17: లైంగిక దాడి కేసులో రెండు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ క్లాస్ అడిషనల్ సెషన్ జడ్జి పీ శివరాం ప్రసాద్ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి ఎం గంగాసింగ్ తెలిపారు. కేసు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని నేతాజీ చౌక్‌కు చెందిన కోడే మనోజ్ (43) బస్టాండ్‌లో మేతర్‌గా పని చేసే వాడు. పట్టణానికి చెందిన మహిళ (30) అదే ఆర్టీసీ బస్టాండ్‌లో కూలీ పని చేస్తుంది. మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. ఆమె మూడు నెలల గర్భం దాల్చింది. అలాగే ఆ మహిళకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొందిన కారు అద్దెకు నడిపించుకున్నాడు. గర్భం తీసేయాలని ఆమెను ఒత్తిడి చేశాడు. దీంతో 29 జూన్ 2020న వారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలోనే మనోజ్ ఆ మహిళ కడుపుపై కొట్టాడు. బాధిత మహిళ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఎన్ని మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చారు. పీపీ షాహిన్ సుల్తానా కేసును రుజువు కావడంతో ఫస్ట్ క్లాస్ అడిషనల్ సెషన్ జడ్జ్ శివరాంప్రసాద్ తీర్పును వెలువడించినట్లు పేర్కొన్నారు.

దేశీదారు, నాటుసారా అమ్మితే కేసులు

ఎదులాపురం, జనవరి 17: దేశీదారు, నాటుసారాపై శుక్రవారం నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి హేమశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ముడిసరుకు రవాణా అరికట్టేందుకు, తయారీ, సరఫరాదారులపై కేసులు నమోదు పెడతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బాసర, జనవరి 17 : నిర్మల్ జిల్లా బాసర మండలం కౌట గ్రామంలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 4,620 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ గణేశ్ తెలిపారు. ఎవరైన పేకాటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెన్‌గంగలో మృతదేహం లభ్యం

బేల, జనవరి 17: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని పెన్‌గంగ నదిలో గురువారం సాయంత్రం బట్టువార్ మహేందర్ మృతదేహం లభ్యమైనట్లు శుక్రవారం ఎస్ఐ దివ్యభారతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. ఖోగ్దూర్ గ్రామానికి చెందిన బట్టువార్ మహేందర్ (21) మద్యానికి బానిసై నాలుగు రోజులు కనబడడం లేదు. కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు చుట్టపక్కల గాలించగా, గురువారం సాయంత్రం మంగ్రూడ్ గ్రామ సమీపంలోని పెన్‌గంగలో మృతదేహం లభ్యమైంది. తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి, జనవరి 17 : చిచ్‌ధరిఖా నాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చిచ్‌ధరిఖానాపూర్‌కు చెందిన ఓ మహిళ గురువారం ఆయా పనుల నిమితం ఇంద్రవెల్లి మార్కెట్‌కు వచ్చింది. తిరిగి సాయంత్రం ఆదే గ్రామానికి చెందిన ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వాగ్మారే తతాగత్ ఆటోలో మహిళ పక్కన కూర్చొని అసభ్యకరంగా ప్రవర్తించాడు. సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడతో పాటు నర్సాపూర్ సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఎదులాపురం, జనవరి 17: ఆదిలాబాద్ పట్టణంలో భుక్తపూర్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కోసం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అసిస్టెంట్ ఇంజినీర్ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ మండలంలోని విద్యనగర్, భూక్తపూర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మొచిగల్లీ, రాణిసతిజి కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నర్సాపూర్(జీ), జనవరి 17 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ (జీ), కుస్లి, అంజని తండా వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భైంసా, జనవరి 17 : భైంసాలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ రోడ్, ఓవైసీ నగర్, రాజీవ్ నగర్, మోమినామ్ గల్లి, ఏక్ మినార్ ఏరియా, మదీనా కాలనీలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎదులాపురం, జనవరి 17 : ఆదివాసుల సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా టీఏజీఎస్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను రూపొందించారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టీఏజీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాయకులతో కలిసి విడుదల చేశారు. క్యాలెండర్‌లో పొందుపరిచిన చిత్రాలు, ఆదివాసుల ప్రాంతాల గురించి నాయకులు జోగు రామన్నకు తెలియజేశారు. కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర నాయకులు పూసం సచిన్, లంక రాఘవులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, జగదీశ్, అశోక్ స్వామి, విఠల్, వినోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు

ఎదులాపురం, జనవరి 17 : ఆదిలాబాద్‌లో తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కొంతమంది దళారులు గ్రూపు-4, ఏఈఈ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇద్దరు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పేరిట మోసం చేసే వారిపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి,17: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డీ అనసూయ (సీతక్క) ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ పథకాల అమలుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ప్రణాళిక కార్యాచరణపై నాలుగు జిల్లాల కలెక్టర్లు అభిలాష అభినవ్, రాజర్షిషా, కుమార్‌దీపక్, వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్సీ దండె విఠల్, నిర్మల్, ఖానాపూర్, ముథోల్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జూ పటేల్, రామారావు పటేల్, పాయల్ శంకర్, అనిల్ జాదవ్, అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 26 నుంచి ప్రారంభించనున్న పథకాలను రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులను పకడ్బందీగా ఎంపిక చేయాలన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలను నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలను వెల్లడించాలన్నారు. సమావేశంలో నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల, వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, శ్యామలాదేవి, దీపక్ తివారీ, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, మున్సిపల్ చైర్మన్లు గంద్రత్ ఈశ్వర్, సత్యం, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

మడిపల్లి భద్రయ్య జయంతి

నివాళులర్పిస్తున్న కలం స్నేహం సభ్యులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 17 : నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి రచయిత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మడిపెల్లి భద్రయ్య జయంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కలం స్నేహం సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలం స్నేహం జిల్లా అధ్యక్షుడు దేవిప్రియ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కడారి దశరథ్, కొండూరు పోతన్న, ఉపాధ్యక్షులు శ్యామల రాణి, రాజమల్లు, ముత్యాల అశోక్‌కుమార్, రవికాంత్ పాల్గొన్నారు.

జైల్లో మగ్గుతున్న లింగాపూర్ వాసులను విడిపించాలి

కడెం, జనవరి 17 : మలేషియా జైల్లో మగ్గుతున్న కడెం మండలం లింగాపూర్ గ్రామ వాసులు రాజకొండ నరేశ్, తలారి భాస్కర్, గుండా భూమరాజు, గురిజాల రాజేశ్వర్, గురిజాల శంకర్‌ను విడిపించి స్వదేశానికి తీసుకరావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్‌ను బాధిత కుటుంబ సభ్యులు కలిసి కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్‌ను ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, ఖానాపూర్ మండలాధ్యక్షుడు దొనికెన దయానంద్ సహాయంతో కలిసి తమ గోడును వెల్లబొసుకున్నారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే ఎన్ఆర్ఐ వింగ్ చైర్మన్ అంబాసీడర్ బీయం వినోద్ కుమార్ విషయం తెలుపగా మలేషియా రాయబారితో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామన్నారు. వారి వెంట గ్రామ పెద్దలు ఆకుల లచ్చన్న, నిమ్మ గణేశ్, తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుల సర్వే

ఖానాపూర్ రూరల్, జనవరి 17: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రేషన్‌కార్డు సర్వేను అధికారులు నిర్వహించారు. కొత్తపేట గ్రామంలో ఎంపీవో చిక్యాల రత్నకర్‌రావు రేషన్ కార్డు సర్వేలో పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. డ్రైనేజీల్లో పూడికను తీయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీపు డ్రైవర్‌పై కేసు

ఎదులాపురం, జనవరి 17 : ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలో ప్రమాదకరంగా ప్రయాణికులతో కలిసి వెళ్తున్న జీపును స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ నుంచి లోకారి గ్రామానికి వెళ్లే క్రమంలో జీపును పట్టుకొని డ్రైవర్ అజీజ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహారాష్ట్ర రైతు మృతి

ఎదులాపురం, జనవరి 17: వేసిన పంటకు పెట్టుబడి రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో మనస్థాపం చెంది పురుగుల మందు తాగిన రైతు మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావు తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా దుంద్ర గ్రామానికి చెందిన తోటవర్ కేశవ్ (60) ఈ నెల 16వ తేదీన పంట పొలాల్లో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ తోటవర్ కేశవ్ శుక్రవారం మృతి చెందాడు. కొడుకు ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు భరోసా సర్వే

లక్ష్మణచాంద, జనవరి 17: రైతు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జానకి తెలిపారు. శుక్రవారం లక్ష్మణచాంద గ్రామంలో సర్వే నిర్వహించారు. ఆమె వెంట మండల సర్వేయర్ రమ్య, ఏఈవో పవిత్ర ఉన్నారు.

మర్కాగూడ కబడ్డీ విజేత కిన్వట్ జట్టు

విజేత జట్లకు చెక్కులు అందజేస్తున్న దాతలు, నాయకులు

భీంపూర్, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం మర్కాగూడలో రాంజీ గోండు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మహారాష్ట్ర కిన్వట్ సేవా క్లబ్‌కు మొదటి బహుమతి రూ. 21వేలు దక్కింది. రెండో బహుమతి తలమడుగు మండలం వైజాపూర్ జట్టుకు రూ. 15వేలు, మూడవ బహుమతి రూ. 10 వేలు మహారాష్ట్ర డోంగర్‌గావ్ జట్టు, నాలుగో బహుమతి రూ. 7 వేలు తలమడుగు మండలం లాల్‌గడ్ జట్టు గెలుచుకున్నాయి. వీటితో సహా మరో 4 జట్లు విశిష్ట బహుమతులు పొందాయి. దాతలు మెస్రం నాగోరావ్, మడావి లింబాజీ, జాదవ్ రవీందర్, రాథోడ్ ఉత్తమ్, పాండురంగ్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. నాయకులు కుడిమెత గంగారాం, దుర్వ శంకర్, రాథోడ్ రవీందర్, బండు, సోమేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవకాశమివ్వాలని సైకిల్ యాత్ర

సైకిల్ యాత్ర చే